# కళ్ళెం

సెంట్రల్ ఎక్సయిజ్ డిపార్టుమెంట్‌లో వుద్యోగంలో వుండటం వల్ల కొన్ని లాభాలుంటాయి వాటిల్లో ఒకటి, ఏ కంపెనీ డైరెక్టర్‌ని అడిగినా, తెలిసిన వాళ్ళకి వుద్యోగం కాదనకుండా ఇస్తాడు.

వాసుదేవడు ఎక్సయిజ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసున్నాడు. చిన్న కంపెనీలకి తరచు వెళుతుంటాడు విజిట్స్ మీద స్పెక్ట్రమ్ అనే ఓ ఇంజనీరింగ్ కంపెనీ మేనేజింగ్ డైరక్టర్ జయకాంత్ అతను వచ్చినపుడల్లా టీ ఆఫర్‌చేసి మర్యాదగా మాట్లాడుతుంటాడు

ఓ రోజు వాసుదేవుడి భార్య అతనితో చెప్పింది.

"మీరు ఇంజనీరింగ్ కంపెనీ ప్రయివేట్ లిమిటెడ్‌కి వెళుతుంటారా?"

"ఏం?"

"అందులో తెలిసిన వాళ్ళెవరయినా వున్నారా?" అడిగింది.

"ఉన్నారు" చెప్పాడు.

"అయితే వుద్యోగం రికమండ్ చెయ్యగలరా?"

"ఎవరికి?"

"నా స్నేహితురాలు సీతకి. మీరు చూడలేదా? మన పెళ్ళికి ఓ అందమయిన అమ్మాయి వచ్చింది. నా స్నేహితురాలని పరిచయంచేస్తే కళ్ళప్పగించి చూస్తూండిపోయారు?"

"అందమయిన అమ్మాయా? ఇంతదాకా నా కళ్ళకి నువు తప్ప ఎవరూ అందంగా కనిపించలేదే?"

"జోక్సు కట్టిపెట్టండి. సీతకి వుద్యోగం కావాలి, మీరు రికమండ్ చేయాలి."

"చూదాం"

"చూద్దాం కాదు. పాపం సీత భర్త పోయాడట. ఓ కూతురుంది. ఆర్థికంగా చాలా ఇబ్బందులలో వుంది."

"అరెరె పాపం"

"స్పెక్ట్రమ్ నించి ఆమెకి ఇంటర్వ్యూ వచ్చింది. ఎల్లుండి ఉదయం పదకొండు గంటలకి. కొద్దిగా మాట సహాయం చేద్దురు"

"నా గురించి ఎలా తెలుసు?"

"ఎలా తెలుసునేమిటి? మన పెళ్ళికి వచ్చినప్పుడు మీరు ఎక్కడ పనిచేస్తున్నారో నేనే చెప్పాను మీరు స్పెక్ట్రమ్ వెళతారని తెలిసి ఈ సహాయం చేయమని వచ్చింది"

"అలాగే రేపే చేస్తాను"

వాసుదేవుడు మర్నాడు వుదయం స్పెక్ట్రమ్ ఇంజనీరింగు కంపెనీ ప్రయివేట్ లిమిటెడ్‌కి తణిఖీకి వెళ్ళాడు ఆ కంపెనీ యం. డి. జయకాంత్‌కి చెప్పాడు. వాళ్ళు పి ఏ. పోస్టులకోసం పిలిచిన అభ్యర్థులలో వున్న సీత తనకు చాలా కావలసిన వ్యక్తి అని, ఆమెకి అర్హతలుంటే ఉద్యోగం ఇవ్వమని.

"తప్పకుండా మీరు చెప్పడం, నేను కాదనకపోవడమూనా" హామి ఇచ్చాడు జయకాంత్.

ఇంటర్వ్యూలో సీత బానే చేసింది. ఆమెని చూడగానే జయకాంత్ ఆమెకే వుద్యోగం ఇవ్వాలని నిర్ణయించుకున్నాడు అంత అందగత్తె, చాలామంది సినిమాస్టార్స్ ఆమెని చూసి తలదించుకోవాల్సిందే. మిస్ ఇండియాలోనే కాదు మిస్ యూనివర్సల్‌గా కూడా ఎన్నికవదగ్గ అందం ఆమెలో వుందనిపించింది జయకాంత్‌కి. అలాంటి అందగత్తె తన దగ్గర పి ఏ.గా పనిచేయటం తన అదృష్టం అని కూడా అనుకున్నాడు.

మొదటి జీతం రాగానే స్వీట్ పేకెట్‌తో ఆమె వాసుదేవుడి ఇంటికి వచ్చింది.

"ఎలా వుంది కొత్త వుద్యోగం ?" అడిగింది వాసుదేవుడి భార్య.

"చాలా హాయిగా వుంది నీ తెలివికి నిజంగా జోహార్లు" చెప్పింది సీత.

ఆమె సీతని పరిశీలనగా చూసింది. బంగారం పోతపోసినట్లున్న విగ్రహం, పొడుగయిన నల్లటి జడ మోకాళ్ళదాకా వుంది మొహంలో, కళ్ళల్లో ఎంతో ఆనందం, వుత్సాహం, ఆమెని చూసిన ఏ మగాడయినా చలించకుండా వుండలేడు. అందులో ఆమె భర్త మరణించాడు వంటరిది అని తెలిస్తే అసలు వూరుకోరీ ఈ పాడు మగాళ్ళు.

గతంలో సీత ఉద్యోగం చేసిన చోట్లలో కనీసం ఒక్క మగా డయినా ఆమె కోసం ప్రయత్నించకుండా ఉండలేకపోయాడు ఫలితంగా రాజీనామా చేసేది. ఏ కంపెనీ ఇంటర్వ్యూకి వెళ్ళినా ఎవరూ ఆమెని కాదనలేదు. ప్రతిచోటా ఉద్యోగం దొరికింది అయితే నాలుగయిదు నెలలు రక్కుండానే ఆమె కోసం మగాళ్లతీవ్రంగా ప్రయత్నంచేయటం. ఆమె రిజైన్ చేయటం

పులుల మధ్య మేకలా ఎంతో టెన్స్‌గా ఉండేది ఆమె పరిస్థితి. ఆ సంగతి తెలిసిన వాసుదేవుడి భార్య ఈ సమస్యకి పరిష్కారం సూచిం చింది. సీత వెంటనే వప్పుకుంది.

తనంతట తానే సీత ఇంటర్వ్యూకెళితే సెలక్ట్ అవుతాననే నమ్మ కం ఉంది, కాని ఆమెకి స్పెక్ట్రమ్‌లో కూడా మరో పులి ఎదురవచ్చు అలా కాక వాళ్ళు భయపడే సెంట్రల్ ఎక్సయిజ్ ఉద్యోగులలో ఎవ రయినా రికమెండ్ చేస్తే ఉద్యోగం కాదనలేరు, ఆమె కోసం ప్రయ త్నించలేరు.

ఆమె బాస్ జయకాంత్ సీతదగ్గర ఎలాంటి పిచ్చివేషాలు వేయ కుండా జాగ్రత్త పడుతూనే వున్నాడు. అతని బలహీనత ఆమెకి తెలిసి, వాసుదేవుడికి చెపితే....

జయకాంత్‌కి ఆ వూహే ఇబ్బందిగా వుంటుంది.